వైభవంగా ఘటాల ఊరేగింపు



రాయగడ: స్థానిక పిట్టల వీధిలో జరుగుతున్న అగ్ని గంగమ్మ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారి ప్రతిరూపాలైన ఘటాలను ఊరేగించారు. అమ్మవారికి ప్రీతికరమైన ఆదివాసీ డప్పులు, వాయిద్యాల నడుమ ఘటాలను ఊరేగించే సంప్రదాయాలను కొనసాగించారు. బుధవారంతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలియజేశారు. మంగళవారం రాత్రి మల్లెలు తొక్కే కార్యక్రమం ఉంటుందన్నారు.

వెండి సింహాసనంపై మా భగవతి



జయపురం: పట్టణ ప్రజల ఆరాధ్య దేవి మా భగవతికి ఆదివారం వెండి సింహాసనం ఏర్పాటు చేశారు. మా భగవతిని వెండి సింహాసనంపై అధిష్టించారు. సింహాసనంపై వెండి ప్రభను అమర్చారు. మాతకు బంగారు ఆభరణాలతో అలంకరించి పూజలు చేశారు. వెండి సింహాసనంపై అధిష్టించిన మా భగవతిని తిలకించేందుకు భక్తులు పోటెత్తారు.

న్యూస్‌రీల్

మూడంతస్తుల భవనం మీద నుంచి పడిన కార్మికులు



నిర్మాణ భవనంపై నుంచి పడి గాయపడిన కార్మికులు

జయపురం: స్థానిక జిల్లా కోర్టు ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న మూడంతస్తుల భవనం పైనుంచి జారిపడి నలుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన ముశీదాబాద్ యూశిఫ్ షేక్(20), రాయిబుల్ షేక్(28), మహ్మద్ ఆసన్(26), ఆలమిన్ షేక్(26) స్లాబ్ వేసేందుకు పనిచేస్తుండగా అకస్మాత్తుగా వెదురు విరిగి కిందకు పడ్డారు. క్షతగాత్రులను జిల్లా కేంద్రాస్పత్రికి చేర్చారు. వారు ఒక కాంట్రాక్టు కంపెనీ తరఫున పనిచేస్తున్నారు. అయితే వారికి రక్షణ పరికరాలు సమకూర్చకపోవటం వల్ల ప్రమాదం జరిగిందని కార్మికులు ఆరోపిస్తున్నారు.

నవరంగపూర్ సరిహద్దులో పులికూన సంచారం



సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న చిరుతపులి పిల్ల

జయపురం: నవరంగపూర్ జిల్లా–ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో ఒక చిరుతపులి పిల్ల సంచరిస్తున్న విషయం సోషల్ మీడియాలో వైరల్ కావటంతో ఆ ప్రాంత ప్రజలు భయపడుతున్నారు. ఏసీఆర్ పోలీసు రెండో శిక్షణ కేంద్రం సిటిజేడబ్ల్యూ కాలేజ్ ప్రాంతంలో చిరుత పులి పిల్ల సంచరిస్తోందని సోషల్ మీడియాలో వైరల్ అయింది. అందు వల్ల ప్రజలు భయపడుతున్నారు.

కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా తారాప్రసాద్



జయపురం: జయపురం ఎమ్మెల్యే, సీనియర్ కాంగ్రెస్ నేత తారాప్రసాద్ బాహిణీపతిని జాతీయ కాంగ్రెస్ కమిటీ ఒడిశా ప్రదేశ్ ఉపాధ్యక్షుడిగా నియమించింది. జయపురం కాంగ్రెస్ శ్రేణులు ఆనందం వ్యక్తం చేశాయి. బాహిణీపతికి కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

కూలిన కాల్వర్టు



కుప్పకూలిన కల్వర్టు

కొరాపుట్: కొరాపుట్–రాయగడ మధ్య కల్వర్టు కుప్ప కూలింది. ఆదివారం ఈ మార్గంలో డుమ్రిపాదర్–తోయాపుట్ మధ్య ఈ ఘటన చోటు చేసుకుంది. భారీ వర్షానికి ఒక్కసారిగా కిందకు జారింది. వెంటనే అప్రమత్తమైన స్థానికులు ప్రమాద సంకేతంగా రాళ్లు పెట్టారు. నిత్యం భారీ వాహనాలు తిరిగే మార్గం కావడంతో వాహనదారులు అప్రమత్తంగా కల్వర్టు దాటుతున్నారు.

సూపర్ స్పెషలిస్ట్ క్లినిక్ ప్రారంభం



సూపర్ స్పెషాలిటీ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ కీర్తివాసన్

జయపురం: కొరాపుట్‌లోగల సహిద్ లక్ష్మణ నాయిక్ వైద్య కళాశాల ఆస్పత్రిలో శనివారం సూపర్‌స్పెషలిస్ట్ క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవంలో కలెక్టర్ వి.కీర్తి వాసన్ ముఖ్యఅతిథిగా పాల్గొని రిబ్బన్ కట్ చేశారు. వైద్య కళాశాల డీన్, హాస్పిటల్ అధికారి డాక్టర్ ప్రొఫెసర్ సుకాంత కుమార్ సాహు, హాస్పిటల్ రిజిస్ట్రార్ రంజన్ మల్లిక్ తదితరులు పాల్గొన్నారు. కార్డియాలజీ, న్యూరోలజీ, నెఫ్రాలజీ విభాగాల స్పెషలిస్టు డాక్టర్లు, సూపర్‌స్పెషలిస్టు క్లినిక్‌ను సందర్శించారు.

పాక్‌తో లింకులపై ..
యూట్యూబర్ విచారణ

- అదుపులోకి తీసుకున్న ఇంటెలిజెన్స్ వర్గాలు
- విచారణకు సహకరిస్తానన్న యూట్యూబర్



ప్రియాంక సేనాపతి

భువనేశ్వర్: పాకిస్తాన్‌తో రాష్ట్రంలో ఉన్న ఓ యువతికి సంబంధం ఉన్నట్లు ప్రసారం కావడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. కేంద్ర, రాష్ట్ర ఇంటెలిజెన్సు వర్గాలు అప్రమత్తమయ్యాయి. ఆ యువతిపై నిఘా కేంద్రీకృతం చేశారు. ఆమెతో సహా కుటుంబీకుల్ని దర్యాప్తు వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. విచారణ నిరవధికంగా కొనసాగుతోంది. ఆ యువతి ఇంటిలోనే దర్యాప్తు వర్గాలు అంచెలంచెలుగా విచారణ చేపడుతున్నాయి. విచారణ తుది నివేదిక ఈ గందరగోళ పరిస్థితిని తేటతెల్లం చేస్తుందని భావిస్తున్నారు. పాకిస్తాన్‌కు రహస్య సమాచారం అందిస్తున్నారనే అనుమానంతో హరియాణా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాను అరెస్టు చేశారు. ఈమె గత సంవత్సరం సెప్టెంబర్ నెలలో పూరీ సందర్శించింది. ఈ సందర్భంగా శ్రీ మందిరం, బీచ్‌తో సహా వివిధ పర్యాటక ప్రదేశాలను సందర్శించింది. జ్యోతి మల్హోత్రా పూరీ సందర్శనలో ఆమెకు ప్రియాంక సేనాపతి సహాయం చేసినట్లు వెలుగులోకి వచ్చింది. ప్రియాంక పాకిస్తాన్ వెళ్లిందని కూడా ప్రసారమైంది. ఈ విషయంపై పూరీ పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. ప్రియాంక సేనాపతి పూరీలోని కాళికాదేవి సాహిలో ఉంటుంది. ఈమె యూట్యూబర్ పూరీ సందర్శనలో జ్యోతి మల్హోత్రాకు సహాయం చేసిందని ఆరోపణలు ఎదుర్కొంటోంది. అయితే ఈ వార్త తనను ఉలికిపాటునకు గురి చేసిందని, విచారణకు పూర్తిస్థాయిలో సహకరిస్తానని ఆమె తెలిపింది.

తండ్రి మాటల్లో ....

ప్రియాంక తండ్రి మాట్లాడుతూ తన కుమార్తెకి పాకిస్తాన్‌తో ఎలాంటి సంబంధం లేదని అన్నారు. ప్రియాంక యూట్యూబర్‌గా ఉన్నప్పుడు జ్యోతి మల్హోత్రాను కలిసిందని, జ్యోతి పూరీకి వచ్చినప్పుడు, ప్రియాంక సహాయం కోరిందని, జ్యోతి మల్హోత్రా సందర్శనకు ప్రియాంక సహాయం చేసిందని తెలిపారు. ప్రియాంక కూడా వ్లాగ్ కోసం పాకిస్తాన్‌లోని కర్తార్‌పూర్‌కు వెళ్లిందని వివరించారు. తన కుమార్తె దర్యాప్తునకు సంబంధించి అన్ని విధాలుగా సహకరిస్తానని, అమాయకులతో పాటు సహకరిస్తానని ప్రియాంక తండ్రి తెలిపారు. పాకిస్తాన్ కోసం గూఢచర్యం ఆరోపణలపై ఇటీవల అరెస్టయిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాతో తనకున్న సంబంధాన్ని ఒడియా యూట్యూబర్ ప్రియాంక సేనాపతి స్పష్టం చేసింది. సేనాపతికి మల్హోత్రాతో సంబంధం ఉందని నివేదికలు వెలువడిన నేపథ్యంలో ఆమె బహిరంగంగా ఈ విషయాన్ని ప్రకటించింది. ఈ సందర్భంగా ఈమె మాట్లాడుతూ తనకు మల్హోత్రా యూట్యూబ్ ద్వారా పరిచయం ఉందని, ఈ పరిచయం యూట్యూబ్ కంటెంట్ రూపకల్పనకు మాత్రమే పరిమితం అని అన్నారు. ఆమెపై (జ్యోతి మల్హోత్రా) ఉన్న తీవ్రమైన ఆరోపణల గురించి తనకు తెలియదని, ఆమె శత్రుదేశం కోసం గూఢచర్యం చేస్తుందని తెలిసి ఉంటే సంబంధం కొనసాగించేదాన్ని కాదని తెలిపారు. దర్యాప్తు సంస్థలకు పూర్తిగా సహకరించడానికి తాను సిద్ధంగా ఉన్నానని ప్రియాంక సేనాపతి ప్రకటించారు. 'ఏదైనా దర్యాప్తు సంస్థ నన్ను ప్రశ్నించాలనుకుంటే, నేను పూర్తిగా సహకరిస్తాను. దేశానికే మొదటి ప్రాధాన్యత' అని ఆమె ముగించారు.

పూరీని విడిచి వెళ్లవద్దు



వినిత్ అగర్వాల్, పూరీ ఎస్పీ

దర్యాప్తు పూర్తయ్యే వరకు పూరీని విడిచి వెళ్లవద్దని దర్యాప్తు వర్గాలు ప్రియాంకకు ఆదేశాలు జారీ చేశాయి. పూరీ జిల్లా పోలీసులు, సెంట్రల్ ఇంటెలిజెన్స్, స్టేట్ ఇంటెలిజెన్స్ వర్గాలు దర్యాప్తు కొనసాగిస్తున్నాయి. దీనికోసం ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. పూరీ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో ఈ బృందం పని చేస్తుంది. ఒడిశా పోలీసులు హరియాణా పోలీసులతో సంప్రదింపులు జరుపుతున్నారు. జ్యోతి మల్హోత్రాతో ప్రియాంక పరిచయం, పాకిస్తాన్‌లోని కర్తార్‌పూర్ సందర్శన కోణంలో విచారణ కొనసాగుతుందని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ నేపథ్యంలో దర్యాప్తు పూర్తయ్యే వరకు ప్రియాంకను పూరీ విడిచి వెళ్లకూడదని ఆదేశించారు. పాకిస్తాన్ గూఢచర్యంకు సంబంధించి బహుముఖ కోణాల్లో దర్యాప్తు జరుగుతుందని పూరీ జిల్లా పోలీసు సూపరింటెండెంటు వినిత్ అగర్వాల్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర నిఘా సంస్థల సంప్రదింపులతో దర్యాప్తు కొనసాగుతుందన్నారు. మరోవైపు హరియాణా పోలీసులతో సంప్రదిస్తున్నారు. ఈ సంఘటనను తీవ్రంగా పరిగణిస్తున్నామని ఎస్పీ పేర్కొన్నారు.

బీజేపీ పాలన వార్షికోత్సవానికి సన్నాహాలు



ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి అధ్యక్షతన ప్రభుత్వ పాలన వార్షికోత్సవం సన్నాహక సమావేశం

భువనేశ్వర్: రాష్ట్రంలో తొలి సారిగా భారతీయ జనతా పార్టీ పాలన పగ్గాలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ సర్కారు పాలన త్వరలో తొలి ఏడాది పూర్తి చేసుకోనుంది. ఈ వేడుకల్ని రాష్ట్ర వ్యాప్తంగా జరుపుకోవాలని ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా ఈ కార్యకలాపాల్ని ప్రత్యక్షంగా సమీక్షిస్తున్నారు. జూన్ 11 నుంచి 13 వరకు వరుసగా 3 రోజులపాటు వార్షికోత్సవాన్ని నిర్వహించడానికి సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది పాలనలో రాష్ట్ర ప్రభుత్వం సాధించిన వివిధ పథకాల విజయాలను రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో ప్రజానీకం దృష్టికి తీసుకుని వెళ్లేందుకు అనేక కార్యక్రమాలు వేడుకగా నిర్వహించనున్నారు. ఈ విజయాల గురించి ప్రజలకు తెలియజేసి వివిధ విభాగాల్లో అభివృద్ధి కార్యకలాపాలను వేగవంతం చేయడం, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడం ఈ చొరవ లక్ష్యమని అధికారులు తెలిపారు. కార్యక్రమాలకు సంబంధించిన రెండో సన్నాహక సమావేశం ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా అధ్యక్షతన స్థానిక ఖారవేల భవన్‌లోని సమావేశం హాల్‌లో జరిగింది. సమావేశంలో అభివృద్ధి కమిషనర్ కమ్ అదనపు ప్రధాన కార్యదర్శి అనూ గర్గ్, హోం శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి సత్యబ్రత సాహు, సాధారణ పాలన, ప్రజాభియోగాల శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి సురేంద్ర కుమార్, ఇతర సీనియర్ కార్యదర్శులు, కమిషనర్లు మరియు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. లోగడ గత నెల 25న వార్షికోత్సవం సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి సంబంధించిన రోడ్ మ్యాప్‌ను ఖరారు చేయడానికి ప్రధాన కార్యదర్శి మనోజ్ ఆహుజా అధ్యక్షతన రెండో సన్నాహక సమావేశం జరిగింది. ప్రభుత్వం సాధించిన కీలక విజయాలను ప్రదర్శించడం, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన పెంపొందించడం, అభివృద్ధి పనులను వేగవంతం చేయడం వార్షికోత్సవం లక్ష్యం. స్థానిక జనతా మైదాన్‌లో రాష్ట్ర స్థాయి కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రదర్శనలు, బహిరంగ సమావేశాలు ఉంటాయని పేర్కొన్నారు. జిల్లా మరియు మండల స్థాయి కార్యకలాపాలు ఏకకాలంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విజగ గాథలతో ప్రగతి ప్రభ అనే పుస్తకం విడుదల చేస్తుంది.

చంపాఘాట్ వద్ద రోడ్డు ప్రమాదం

- బస్సు, బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరి మృతి
- ఇద్దరికి గాయాలు



సంజయ్ బోదోరయితో మృతదేహం

పర్లాకిమిడి: జిల్లాలోని ఆర్.ఉదయగిరి బ్లాక్ చంపాఘాట్ వద్ద రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా ఇద్దరు గాయపడ్డారు. ప్రైవేటు బస్సు (విక్రాంత్), ముగ్గురు ప్రయాణిస్తున్న బైక్ పరస్పరం ఢీకోవడంతో ప్రమాదం చోటుచేసుకుంది. బరంపురం నుంచి గజపతి జిల్లా ఆర్.ఉదయగిరి నుంచి కెరడం గ్రామానికి వెళ్తున్న బస్సును ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న సంజయ్ బోడోరయి ప్రాణాలో కోల్పోగా జోష్ట్ బోడోరయితో, రింకురయితోకు తీవ్రగాయాలయ్యాయి. వీరు వివాహ కార్డులు పంపిణీ చేయడానికి ఆర్.ఉదయగిరి నుంచి శనివారం బయలుదేరారు. క్షతగాత్రులను భోజురిపద ప్రాథమిక వైద్య కేంద్రంలో చేర్చారు. సంజయ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఆర్.ఉదయగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్, వ్యాన్ ఢీకొని మహిళ మృతి



హసమాతి మృతదేహం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి స్పిల్‌వే సమీపంలో ఆదివారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఓ మహిళ ప్రాణాలు కోల్పోయింది. సీబిమాన్ ఏరియా లడోలియాంబ్ గ్రామం నుంచి కమలలోచన్ ఖోరా అతని భార్య హసమాతి ఖోరా ద్విచక్ర వాహనంపై చిత్రకొండ సమీపంలోని ఆలయానికి వెళ్లి తిరుగు వస్తున్నారు. ఇదే సమయంలో ఎదురుగా వచ్చిన పికప్ వ్యాన్ బలంగా ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. బైక్ పైనుంచి దంపతులిద్దరూ పడిపోయారు. హసమాతి తలకు బలమైన గాయం తగలడంతో సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయింది. ప్రమాద సమాచారం తెలుసుకున్న ఐఐసీ ముకుందో మేల్క ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. హసమాతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్రకొండ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతురాలికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. తల్లి చనిపోవడంతో వారంతా కన్నీరుమున్నీరుగా రోదించారు.

120 లీటర్ల మద్యం స్వాధీనం

- ఇద్దరు అరెస్ట్



మద్యం బాటిళ్లతో రాజేంద్ర గౌడ్

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ సమితి భలిమెల పోలీసు స్టేషన్ పరిధిలో గల పుష్పాలీ గ్రామంలో నివసిస్తున్న సుదర్శన్ దాస్ అనే యువకుడు లైసెన్స్ లేకుండా విదేశీ మద్యం విక్రయిస్తున్నాడని తెలిసి పోలీసులు ఆదివారం ఉదయం దాడి చేశారు. 50 లీటర్ల విదేశీ మద్యంతో పోలీసులకు పట్టుబడ్డాడు. మురికిగూడ గ్రామానికి చెందిన రాజేంద్ర గౌడ్ అనే యువకుడు లైసెన్స్ లేకుండా 70 లీటర్ల విదేశీ మద్యంతో పట్టుబడ్డాడు. ఇద్దరిపై కోరుకొండ ఏఎస్ఐ అజిత్ కుమార్ టాక్రి కేసు నమోద్ చేశారు. నిందితులను సోమవారం కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

అనుమతి లేకుంటే కూల్చేయాల్సిందే: ఎన్‌జీటీ

భువనేశ్వర్: కొరాపుట్ జిల్లాలో దేవమాలి ఎత్తైన శిఖర పర్యటన కేంద్రంగా వెలుగొందుతోంది. ఈ ప్రాంతంలో పర్యాటక కార్యకలాపాలపై జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) తూర్పు జోనల్ బెంచ్ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. దేవమాలి పర్యాటక ప్రాంతంలో నిర్మించిన నిర్మాణాలకు 3 నెలల్లోపు అటవీ సంరక్షణ చట్టం, 1980 కింద అనుమతి పొందాలని, లేదా వాటిని కూల్చివేసి భూమిని పునరుద్ధరించాలని స్పష్టంగా ఆదేశించింది. డైనింగ్ హాళ్లు, డార్మిటరీలు ఇతర నిర్మాణాలతో కూడిన పర్యాటకుల కోసం 10 కుటీరాలు నిర్మించేందుకు ముందస్తు అనుమతులు లేవనే ఆరోపణపై విచారణ పురస్కరించుకుని ట్రిబ్యునల్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. జస్టిస్ బి అమిత్ స్థాలేకర్ (న్యాయ సభ్యుడు), అరుణ్ కుమార్ వర్మ (నిపుణ సభ్యుడు)లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. నిర్ణీత సమయంలోపు అవసరమైన ఆమోదం పొందకపోతే నిర్మించిన నిర్మాణాలను తొలగించి, ఆ ప్రాంతాన్ని వాస్తవ రూపానికి పునరుద్ధరించాలి. ఏ సందర్భంలోనైనా ప్రశ్నార్థకమైన భూమిని అటవీయేతర ప్రయోజనాల కోసం మళ్లించకూడదని, ప్రతివాదులు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అటవీ హక్కుల చట్టం, 2006 వన సంరక్షణ, సంవర్ధన అధినియం, 1980 నిబంధనల్ని కచ్చితంగా పాటించాలని ట్రిబ్యునల్ ఆదేశాల్లో పేర్కొంది. ఒడిశా వైల్డ్‌లైఫ్ సొసైటీ దేవమాలి ప్రాంతంలో పర్యాటకుల కోసం చేసిన నిర్మాణాలను ట్రిబ్యునల్‌లో సవాలు చేసింది. అటవీయేతర కార్యకలాపాలకు ముందస్తు అనుమతి అవసరమని పేర్కొంది. కేంద్రం స్వదేశ్ దర్శన్ పథకంలో భాగమైన దేవమాలి ప్రాజెక్టులో పర్యాటకాన్ని ప్రోత్సహించడానికి మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం రూ. 16 కోట్లు కేటాయించారు. ప్రతిపాదిత రూ. 4 కోట్ల 50 లక్షలతో పర్యావరణ పర్యాటక సముదాయం నిర్మించారు. ఈ చర్య వివాదాస్పదంగా మారింది.

రాణిగుడఫారంలో చోరీ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం



చోరీ జరిగిన ఇల్లు

రాయగడ: స్థానిక రాణిగుడఫారం డీఎఫ్‌ఓ రెండో కాలనీలో నివసిస్తున్న బసంత కుమార్ స్వాయి ఇంట్లో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఇంటి తలుపులు వేసి ఉండటాన్ని గమనించిన గుర్తు తెలియని దుండగులు తాళాలను విరగ్గొట్టి లోపలకు ప్రవేశించారు. బీరువాలోని 12 తులాల వెండి పట్టీలు, 60 వేల రూపాయల నగదును దొంగిలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సైంటిఫిక్ బృందంతో సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. బసంత కుమార్ స్వాయి డీఎఫ్‌వో రెండో కాలనీలో అద్దె ఇంట్లో నివసిస్తున్నాడు. వారం రోజుల క్రితం కుటుంబంతో కలిసి పనిమీద కటక్ వెళ్లాడు. ఆదివారం తెల్లవారున ఇంటి యజమాని గౌరి శంకర్ పాత్రో ఇంటి తలుపులు తెరిచి ఉండటం గమనించి దొంగతనం జరిగినట్లు గుర్తించారు. అనంతరం చోరీ జరిగిన విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు.

వ్యాపారి ఇంటిలో దొంగతనం



సామానులను చిందర వందర చేసిన దొంగలు

జయపురం: నందపూర్ పోలీసు స్టేషన్ పరిధి లమతాపుట్ సమితి పెట్ట గ్రామంలో శుక్రవారం రాత్రి ఒక వ్యాపారి ఇంటిలో దొంగతనం జరిగింది. ఆ ఇంటిలో రూ.50 వేలు నగదు తో పాటు లక్షల విలువైన బంగారు నగలు, 2 మొబైల్ ఫోన్లు దొంగిలించారు. దీనిపై బాధితుడు నందపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపేందుకు ఒక టీమ్‌ను నియమించారు. వ్యాపారి డొంబురు గతన్ తన ఫిర్యాదులో రాత్రి ఒంటి గంటన్నర సమయంలో తన కిరాణా షాపునకు కొంత మంది దుండగులు ముఖాలు కప్పుకొని వచ్చి సీసీ కెమెరాలు కప్పివేశారని తెలిపారు. అనంతరం ఐదుగురికి పైగా ఉన్న దుండగులు మారణాయుధాలతో ఇంటి వద్దకు వచ్చి ముందు తలుపు విరిచి లోపల ప్రవేశించారని తెలిపారు. తనను బెదిరించి డబ్బు, బంగారం, మొబైల్ ఫోన్లు తీసుకెళ్లిపోయారని పేర్కొన్నారు. ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు సైంటిఫిక్ టీమ్‌తో వచ్చి దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసుని రెండు పోలీసు టీమ్‌లతో దర్యాప్తు జరిపిస్తున్నట్లు పోలీసు వర్గాల ద్వారా తెలిసింది.

మర్లభ ఘాటి వద్ద బస్సు ప్రమాదం



మర్లబ ఘాటి వద్ద కొండను గుద్దుకున్న ప్రైవేటు బస్సు



మర్లబ ఘాటి వద్ద కొండకు గుద్దుకున్న ప్రైవేటు బస్సు



ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

పర్లాకిమిడి: గజపతి జిల్లా రాయగడ బ్లాక్ మర్లబ ఘాటీ దిగుతుండగా ఆదివారం ఉదయం 5.30 గంటల సమయంలో భువనేశ్వర్ నుంచి ఆర్.ఉదయగిరి మీదుగా పర్లాకిమిడి వస్తుండగా ఇస్పాత్ అనే ప్రైవేటు బస్సు అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. ఈ దుర్ఘటనలో 21 మందికి గాయాలయ్యాయి. వీరిని రాయగడ బ్లాక్ ప్రాథమిక చికిత్స కేంద్రానికి తరలించారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని పర్లాకిమిడి కేంద్ర ప్రభుత్వాస్పత్రికి ఉదయం తరలించారు. అనంతరం మరింత మెరుగైన చికిత్స కోసం బరంపురం మెడికల్‌కు తరలించారు. ప్రస్తుతం పర్లాకిమిడిలో కొంతమంది క్షతగాత్రులు చికిత్స పొందుతున్నారు. సంఘటన స్థలానికి రాయఘడ పోలీసు అధికారులు చేరుకుని కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు. మర్లబ ఘాటి వద్ద ఇలాంటి దుర్ఘటనలు తరచూ జరుగుతున్నాయి.

క్లుప్తంగా

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న సీఐ ఈశ్వరరావు

శ్రీకాకుళం క్రైమ్: శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా ప్రవర్తించినా.. అల్లర్లు, అలజడులు సృష్టించేందుకు యత్నించినా పీడీ యాక్టులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని, జిల్లా నుంచి బహిష్కరిస్తామని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి రౌడీషీటర్లకు హెచ్చరించారు. నేరాల కట్టడిలో భాగంగా జిల్లావ్యాప్తంగా ఉన్న రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించాలని ఎస్పీ పోలీసు అధికారులను ఆదేశించారు. దీనిలో భాగంగా ఆదివారం వివిధ పోలీస్‌స్టేషన్లలో షీట్లు నమోదైన వారిని ఎస్‌హెచ్‌వోలు పిలిపించి మాట్లాడారు. నేర ప్రవృత్తి మాని సత్ప్రవర్తనతో మెలగాలని, కబ్జాలకు, బ్లాక్‌మెయిలింగ్‌లకు పాల్పడరాదని హితవుపలికారు. పేకాట డెన్‌లు నిర్వహించరాదని, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు వినియోగించరాదని, అక్రమ రవాణా చేయరాదని చెప్పారు. కాగా, శ్రీకాకుళం రెండో పట్టణ పీఎస్‌లో 39 మంది రౌడీషీటర్లుండగా, ఒకటో పట్టణ పరిధిలో 36 మంది ఉన్నట్లు సీఐ ఈశ్వరరావు, ఎస్ఐ హరికృష్ణ తెలిపారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి



ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులతో ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యావ్యవస్థలో ఉన్న టీచర్లు, లెక్చరర్లు, ప్రొఫెసర్ల వెన్నంటే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు అన్నారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో వివిధ ఉపాధ్యాయ సంఘాలు, అభిమానులు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ విద్యారంగంలో నెలకొన్న సమస్యలను సీఎం, డిప్యూటీ సీఎం, విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు భైరి అప్పారావు, తంగి మురళీమోహన్‌రావు, పప్పల రాజశేఖరరావు, దానేటి కేశవరావు, దుప్పల శివరాంప్రసాద్, సురేస్‌సింగ్, వెంకటరమణ, శ్రీనివాస్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష

ఎచ్చెర్ల క్యాంపస్: జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష చిలకపాలేంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కాలేజ్ ఆదివారం నిర్వహించారు. మొదటి షిఫ్టులో 242 మందికి 239 మంది, రెండో షిఫ్టులో 242 మందికి 239 మంది హాజరయ్యారు

ఐక్యవేదిక ఉద్యమాన్ని విజయవంతం చేయండి

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి చేపట్టనున్న ఉద్యమాలలో ఉపాధ్యాయులంతా స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీ ఎస్టీఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినాన చందనరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మజ్జి చిన్నబాబు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సప్పటి మల్లేసు, పంచాది గోవిందరాజులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థ కొన ఊపిరితో కొనసాగుతోందన్నారు. తొమ్మిది రకాల స్కూల్ వ్యవస్థతో గందరగోళంగా తయారైందని మండిపడ్డారు. నూతనంగా ఏర్పాటు చేస్తున్న పాఠశాలల పునర్వ్యవస్థీకరణ విధానాన్ని అనేక మంది తల్లిదండ్రులు వ్యతిరేకిస్తున్నారని, పాతపద్ధతిలోనే ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల వ్యవస్థలను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. బదిలీలు, రేషనలైజేషన్‌లలో అసంబద్ధమైన విధానాలను తీవ్రంగా వ్యతిరేకించారు. స్కూల్ అసిస్టెంట్లను ఎలిమెంటరీ పాఠశాలకు కేటాయించడం, రెండు మూడుసార్లు రేషనలైజేషన్‌కు గురైన ఉపాధ్యాయులకు సరైన న్యాయం జరగకపోవటం, హైస్కూల్లో సెక్షన్‌కు 54 మందిని పరిగణించడం తగదన్నారు. ఐక్యవేదిక ఇచ్చిన పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామన్నారు.

తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర విద్యాశాఖలో జరుగుతున్న అసంబద్ధమైన, అస్తవ్యస్త నిర్ణయాల పట్ల అటు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఇటు ఉపాధ్యాయులు గందరగోళానికి గురవుతున్నారని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసరెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ ప్రతినిధులతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగు మాధ్యమం లేకుండా కేవలం ఇంగ్లిష్ మీడియంలోనే విద్యను కొనసాగిస్తామని ప్రభుత్వం నిర్ణయించడం వల్ల విద్యార్థుల మానసిక, సృజనాత్మక నైపుణ్యాలను అందిపుచ్చుకోవడంలో వెనుకబాటుకు గురవుతారని ఆందోళన వ్యక్తంచేశారు. గత ఐదేళ్లలో ఇంగ్లిష్ మాధ్యమాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన కూటమి నాయకులు ఇప్పుడు మాటమార్చడం తగదన్నారు.

చెలరేగిపోతున్న..
మట్టి మాఫియా



తేలుకుంచిలో దేవదాయ భూమిలో మట్టి తవ్వకాలు

- అనుమతులు లేకుండా జేసీబీ, ట్రాక్టర్ల ద్వారా మట్టి తరలింపు
- ఇటుక బట్టీలు, ప్లాట్లకు అమ్మకాలు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- పట్టించుకోని అధికార యంత్రాంగం

ఇచ్ఛాపురం రూరల్: ఒకప్పుడు మండలంలో ఎటు చూసినా పచ్చని పంట పొలాలు..చెట్లు, గుట్టలతో ఆహ్లాదకర వాతావరణ దర్శనమిచ్చేది. ప్రస్తుతం కొంతమంది బడా నాయకులు పంట పొలాలు చదును పేరుతో అక్రమ మార్గంలో మట్టి దందా జోరుగా సాగిస్తున్నారు. మట్టిని తరలించి అందినకాడికి దండుకుంటున్నారు. దీనిని అరికట్టాల్సిన అధికారులు చోద్యం చూస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇచ్ఛాపురం మండలంలోని తేలుకుంచి, కేశుపురం, హరిపురం, కొళిగాం, ధర్మపురం, తులసిగాం, లొద్దపుట్టి, ఈదుపురం, అరకబద్ర, మశాఖపురం, బిర్లంగి, మండపల్లి పంచాయతీ తదితర ప్రాంతాల్లో గట్టు చప్పుడు కాకుండా పంట భూములను తవ్వేసి దర్జాగా ఇటుక బట్టీలు, ప్లాట్లకు వేసుకుంటున్నారు. తేలుకుంచి తదితర గ్రామాల పరిధిలో దేవదాయ శాఖ భూములను సైతం అక్రమార్కులు వదలడం లేదు.

అనుమతులేవీ..?

పచ్చని పంట పొలాల్లో పాగా వేసి నాలా కన్వర్షన్ చేసుకోకుండా, స్థానిక సంస్థలతో అనుమతులు తీసుకోకుండా కొందరు మట్టి తవ్వకాలు చేపడుతూ ప్లాట్లు వేస్తున్నారు. వ్యవసాయ భూమిని ప్లాట్లుగా విభజించాలంటే తొలుత ఆ భూమిని తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయేతర భూమిగా (నాలా కన్వర్షన్) చేసుకోవాలి. మండలంలో ప్రస్తుతం అవేమీ కనిపించడం లేదు. మండలంలో సుమారు పాతిక వరకు ఇటుక బట్టీలు ఉన్నాయి. వీటి కోసం జేసీబీ వాహనాలు ఉన్న యజమానులు ట్రాక్టర్లతో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు.



కేశుపురంలో జేసీబీ సహాయంతో మట్టి తవ్వకాలు



పాయితారి ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన ప్లాట్లు వేసిన మట్టి

చెరువును కప్పేస్తున్నారు..

సంతబొమ్మాళి: అక్రమాలను అరికట్టాల్సిన అధికారులే వాటికి వంత పాడుతుండటంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. సంతబొమ్మాళి మండల ఉపాధి ఏపీవో పంగ నరసింహమూర్తి స్వగ్రామమైన చెట్లతాండ్ర గ్రామంలో ఉపాధి పనులు జరుగుతున్న పెద్ద చెరువును కప్పేస్తున్నారు. టాక్టర్ల ద్వారా మట్టిని తరలించి పూర్తిగా కప్పేస్తున్నారు. ఈ చెరువులో నీరు పంట భూములకు ఎంతగానో ఆసరాగా నిలిచేదని, ఇప్పుడు భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిబధనలకు విరుద్ధంగా చెరువులో పనులు జరుగుతున్నా ఏపీవో పట్టించుకోకపోవడంపై గ్రామస్తులు తప్పుపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



చెట్లతాండ్రలో చెరువును కప్పేస్తున్న దశ్యం

చర్యలు తప్పవు..

సొంత పొలాల్లో సైతం మట్టి తవ్వకాలు జరపడం చట్ట విరుద్ధం. మైనింగ్ శాఖాధికారుల పర్మిషన్ తీసుకోవాల్సిందే. దేవదాయ భూముల్లో మట్టి తవ్వకాలు జరిపితే ఎండోమెంట్ శాఖాధికారుల అనుమతి తప్పనిసరిగా పొందాలి. పంట పొలాల్లో నాలా కన్వర్షన్ లేకుండా ప్లాట్లు వేస్తే కఠిన చర్యలు తప్పవు.

– ఎస్.వెంకటరావు, ఇచ్ఛాపురం తహసీల్దార్

నౌపడలో నిబంధనలకు విరుద్ధంగా వేసిన లేఅవుట్



అంతా ఇష్టారాజ్యం!

- నౌపడలో అక్రమ లేఅవుట్
- కోర్టులో కేసు ఉన్నా.. అనుమతులు లేకపోయినా అమ్మకానికి సిద్ధం

సంతబొమ్మాళి: జిల్లాలో అక్రమ లే అవుట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఎలాంటి అనుమతులు లేకపోయినా ఇష్టారాజ్యంగా ప్లాట్ల అమ్మకాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే నౌపడలో అక్రమ లేఅవుట్ వెలిసింది. ఓవైపు సంబంధిత స్థలం విషయమై కోర్టులో కేసు ఉన్నా.. మరోవైపు కన్వర్షన్ చేయకుండా, పంచాయతీ అనుమతి లేకున్నా లేఅవుట్‌లోని ప్లాట్లను లక్షల రూపాయల్లో విక్రయించడానికి సిద్ధం చేసేశారు. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. నౌపడలో సర్వేనెంబర్ 486–3లో 82 సెంట్లు, 486–4లో 5 సెంట్లు కలిపి మొత్తం 87 సెంట్ల విస్తీర్ణంలో ఎటువంటి అనుమతులు లేకుండా లేఅవుట్‌ను వేశారు. ఇదంతా తెలిసినా రెవెన్యూ, పంచాయతీ అధికారులు ఏమీ చేయలేని పరిస్థితిలో ఉన్నారు.

నిబంధనలకు తూట్లు..

నిబంధనల ప్రకారం లేఅవుట్ వేసేముందు వ్యవసాయేతర భూమిగా మార్చేందుకు అధికారులు అనుమతి పొందాలి. అనంతరం ప్లాట్లు వేసేముందు ప్లానింగ్ అధికారుల అనుమతి తీసుకోవాలి. ఆ తర్వాత అధికారులు లేఅవుట్‌లోని భూములను పరిశీలించి అనుమతులు ఇస్తారు. అలాగే సామాజిక అవసరాల నిమిత్తం 10 శాతం భూమిని పంచాయతీకి కేటాయించాల్సి ఉంది. డ్రైనేజీలు, రోడ్లు కొలతల ప్రకారం ఏర్పాటు చేయాలి. అయితే స్థానికంగా అవేమీ కనిపించడం లేదు. ఎటువంటి అనుమతులు లేకుండా లేఅవుట్‌లో ప్లాట్లు అమ్మకాలు సాగిస్తుండటం గమనార్హం.

కోర్టులో కేసు..

సర్వే నెంబర్ 485–3 సంబంధించి కోర్టులో కేసు నడుస్తోంది. వారసత్వంగా వచ్చిన ఆస్తిలో తనకు అన్యాయం చేశారని పలికిల శ్రీలక్ష్మి కోర్టును ఆశ్రయించారు. దీనికి సంబంధించిన పత్రాలను సైతం రెవెన్యూ అధికారులకు అందజేశారు. ఈ పరిస్థితిలో లేఅవుట్ ఎలా వేశారని ఆమె ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు.

కన్వర్షన్ చేయలేదు..

లేఅవుట్ ఏర్పాటు చేసే ముందు వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చుకోవాలి. కన్వర్షన్ అయ్యాకే లేఅవుట్ పనులు ప్రారంభించాలి. నౌపడలో సర్వే నెంబర్ 486–3,4లో కన్వర్షన్ కోసం దరఖాస్తు చేయలేదు. కోర్టు పరిధిలో ఉంటే సంబంధిత పత్రాలు తహసీల్దార్‌కు అందజేయాలి.

– ముంగులు, వీఆర్వో, నౌపడ

అనుమతులు లేవు..

నౌపడలో వేసిన లేఅవుట్లకు ఎటువంటి పంచాయతీ అనుమతులు లేవు. ఇంతవరకు పంచాయతీ అధికారులను ఎవరూ సంప్రదించలేదు.

– యు.ఉమాపతి, పంచాయతీ కార్యదర్శి, నౌపడ

సివిల్స్ ర్యాంకర్‌కు సత్కారం



సాయి మోహిని మానసను సన్మానిస్తున్న ఉద్యోగ, కుల సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం మట్టిలో పుట్టిన మాణిక్యం రావాడ సాయి మోహిని మానస అని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఉపకులపతి కె.ఆర్.రజినీ అన్నారు. సివిల్స్‌లో 975వ ర్యాంక్ సాధించిన రావాడ సాయి మోహిని మానసను ఆదివారం శ్రీకాకుళం నగరంలోని అంబేడ్కర్ విజ్ఞాన మందిర్ దళిత, ఉద్యోగ, ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత మాట్లాడుతూ శ్రమ, పట్టుదల, నిరంతర అధ్యయనం, తల్లిదండ్రులు ప్రోత్సాహమే నా విజయానికి కారణమని చెప్పారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు రావాడ ప్రకాశ్, ఉషారాణి, రైల్వే అధికారి కుందన రామారావు, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, ఏపీఎన్జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం, రిటైర్డ్ జైల్ శాఖ డీఎస్పీ బత్తిన కృష్ణారావు, డాక్టర్ జగదీష్, కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్కా కృష్ణయ్య, సామాజిక న్యాయ పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాసి గణేష్, మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కె.వి.జగన్నాథరావు, ఆంధ్రప్రదేశ్ గిడ్డంగుల శాఖ అధికారి కంబాల రవిరాజా, అసోసియేషన్ నాయకులు బత్తిలి మురళీకృష్ణ, పొన్నాడ రుషి, రుంకు అప్పారావు, రుంకు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ మృతులకు నివాళిగా కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అరసవల్లి: అంతర్జాతీయ ఎయిడ్స్ స్మారక దినోత్సవం సందర్భంగా ఆదివారం జిల్లా వైద్యారోగ్య శాఖకార్యాలయం నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.అనిత ఆధ్వర్యంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నివారణాధికారి డాక్టర్ టి.శ్రీకాంత్ సమక్షంలో ఎయిడ్స్ మృతులను స్మరించుకుంటూ కొవ్వొత్తులను వెలిగించి నివాళులు అర్పించారు. 'ఎయిడ్స్‌తో చనిపోయిన వారిని గుర్తుంచుకుంటాం.. మేం మాట్లాడతాం..మేం నడిపిస్తాం..' అంటూ నినాదాలు చేశారు.కార్యక్రమంలో ఏఆర్‌టీ మెడికల్ ఆఫీసర్ సీహెచ్.అప్పలనాయుడు, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ పి.మోహిని, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ ఆదిలింగం, సామాజికవేత్త వెంకటస్వామి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

బ్లడ్ బ్యాంకుల్లో..
నిల్వలు నిల్!

- అత్యవసర వేళల్లో రక్తం అందక అవస్థలు
- రక్తదాతలు ముందుకు రావాలని నిర్వాహకుల పిలుపు



రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో ఖాళీగా ఉన్న ఫ్రిజ్

శ్రీకాకుళం కల్చరల్: జిల్లాలోని బ్లడ్ బ్యాంకుల్లో రక్త నిల్వలు తగ్గిపోయాయి. దీంతో అత్యవసర వేళల్లో రక్తం అందక చాలామంది ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు ప్రమాద బాధితులతో పాటు తలసేమియా, సికిల్‌సెల్ ఎనీమియా, క్యాన్సర్, డయాలసిస్ పేషెంట్లు తదితర బాధితులకు రక్తం అందించలేని పరిస్థితి ఏర్పడింది. ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు ద్వారా తలసేమియా పిల్లలకు ఉచితంగా రక్తం ఎక్కిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం జిల్లాలో రక్తం నిల్వలు నిండుకున్న నేపథ్యంలో ఆయా చిన్నారులు అవస్థలు పడుతున్నారు. దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు పిలుపునిస్తున్నారు. కార్యాలయాలు, గ్రామాల్లో ఎప్పటికప్పుడు రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నప్పటికీ జిల్లా అవసరాలకు తగ్గట్లు నిల్వలు సరిపోవడం లేదని చెబుతున్నారు. ప్రస్తుతం బ్లడ్ బ్యాంకులో కొన్ని రకాల బ్లడ్ యూనిట్లు పూర్తిగా ఖాళీ అయ్యాయని, రక్తదాతలు స్పందించాలని కోరుతున్నారు.

రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో 18వ తేదీ సాయంత్రం నాటికి నిల్వలు ఇవే

పూర్తి బ్లడ్	నిల్వ(ప్యాకెట్లు)	పీఆర్‌బీసీ(సెల్స్)
ఓ పాజిటివ్	04	15
ఓ నెగెటివ్	నిల్	01
ఏ పాజిటివ్	02	09
ఏ నెగెటివ్	నిల్	నిల్
బీ పాజిటివ్	04	03
బీ నెగెటివ్	నిల్	నిల్
ఏబీ పాజిటివ్	నిల్	నిల్
ఏబీ నెగెటివ్	నిల్	నిల్

దాతలు ముందుకు రావాలి



యువత, స్వచ్ఛంద సేవా సంస్థలు, గ్రామైక్య సంఘాలు, మానవతా మూర్తులు స్పందించాలి. విరివిగా రక్తదాన శిబిరాలు నిర్వహించాలి. శిబిరాలు నిర్వహించడానికి అవకాశం లేని వారు రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకుకు వచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేయవచ్చు. శిబిరం ఏర్పాటు చేయదలచుకుంటే 94404 90525 నంబరును సంప్రదించాలి.

– పి.జగన్మోహనరావు, రెడ్‌క్రాస్ చైర్మన్

3 సెంట్ల స్థలం.. 200 మంది జనాలు

- బల ప్రదర్శనకు దిగిన టీడీపీ నాయకులు
- రంగంలోకి దిగిన పోలీసులు
- శాంతిభద్రతలకు విఘాతంపై ఎస్సై ఆగ్రహం



ఇరువర్గాలను హెచ్చరిస్తున్న జె.ఆర్.పురం ఎస్ఐ చిరంజీవి

రణస్థలం: భూ వివాదం నేపథ్యంలో రణస్థలం టీడీపీ నాయకులు బల ప్రదర్శనకు దిగారు. భారీగా మద్దతుదారులను తీసుకొచ్చి తోపులాటకు దిగారు. రంగంలోకి దిగిన పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించినందుకు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జె.ఆర్.పురం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల.. టీడీపీ నాయకుడు, కృష్ణపురం మాజీ ఎంపీటీసీ సభ్యుడు ముల్లు కృష్ణ, మాజీ ఎంపీపీ డీజీఎం ఆనందరావు మధ్య కొన్నాళ్లుగా 3సెంట్ల భూమి విషయమై వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో వారం కింద కృష్ణ తాను కొనుగోలు చేసిన 3సెంట్ల స్థలాన్ని చదును చేస్తుండగా ఆనందరావు వర్గీయులు అడ్డుకున్నారు. స్థలం సర్వ హక్కులు తమకే ఉన్నాయని గొడవ పడ్డారు. ఈ వివాదంపై ఇరువురు జె.ఆర్.పురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. తాజాగా ఆదివారం కృష్ణ తన అనుచరులతో మరోసారి స్థలం బాగు చేస్తుండగా ఆనందరావు వర్గీయులు వచ్చి అడ్డుకున్నారు. ఇరువర్గాలకు చెందిన సుమారు 200 మంది జనం చేరడంతో తోపులాటకు దారితీసింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఇరువర్గాలకు సర్దిచెప్పినా వినలేదు. ఎస్సై చిరంజీవి మరికొంత మంది సిబ్బందితో వచ్చి ఇరువర్గాలను చెదరగొట్టారు. మూడు సెంట్ల స్థలం కోసం ఇంత రభస చేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడి నుంచి వెళ్లకపోతే కేసులు నమోదు చేస్తానని హెచ్చరించారు.

పత్రాలు పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు రావాలని ఇరువర్గాలకు చెప్పి పంపించేశారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ రెవెన్యూ అంశం కావడం వల్ల తహసీల్దార్‌కు అప్పగించామని చెప్పారు. ఎటువంటి గొడవలు పడకుండా ఇరువర్గాలపై బైండోవర్ నమోదు చేస్తున్నామని తెలిపారు.

రేపు ఆంధ్రా జోనల్ స్థాయి బాడీబిల్డింగ్ పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాకు బాడీబిల్డర్లు గర్వకారణంగా నిలుస్తున్నారని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కోడి రామ్మూర్తి స్టేడియం సమీపంలో ఉన్న అంబేడ్కర్ ఆడిటోరియం వేదికగా ఈ నెల 20న జరగనున్న ఆంధ్రా జోనల్‌స్థాయి బాడీబిల్డింగ్ చాంపియన్‌షిప్–2025 పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. నిర్వాహకులు విజయ్, ప్రసాద్‌లను అభినందించారు. పోటీలో పాల్గొనే బాడీ బిల్డర్లకు భోజన, వసతి సౌకర్యాలతో పాటు రూ. 57వేల నగదు బహుమతులు అందజేయనున్నట్టు స్టార్ బాడీబిల్డర్స్ ప్రధాన కార్యదర్శి వి.విజయ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షుడు దుంగ శ్రీధర్, బి.మధు, సరస్వతి థియేటర్ మేనేజర్ చిన్నరాజు, పి.గోవిందరావు, పి.శ్రీనివాసరావు, కామరాజు, ది ఆంధ్ర బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వాడపల్లి శ్రీనివాసరాజు, ప్రెసిడెంట్ స్వామి రమేష్ కుమార్, శ్రీకాకుళం జిల్లా సెక్రెటరీ కె.గౌరీశంకర్, బి.దేవభూషణ్, నేషనల్ రిఫరీ బి.సూరిబాబు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెట్లకు ఐడీ కార్డులు



మాట్లాడుతున్న ఏపీ స్టేట్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొన్న మధుసూదనరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రంలో అథ్లెటిక్స్ క్రీడాకారులకు ఐడీ కార్డులను అందజేయడంతో పాటు వారి ప్రగతి, గణాంకాలు, ట్రాక్ రికార్డులన్నీ అందులోనే నమోదు చేస్తామని అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు కొన్న మధుసూదనరావు అన్నారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం ఆదివారం నగరంలో నిర్వహించారు. ఏపీ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ చైర్మన్ కొన్న వెంకటేశ్వరరావు(వాసు) సూచనల మేరకు నిర్వహించిన ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

ఈ సందర్భంగా మధుసూదనరావు మాట్లాడుతూ అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఏఎఫ్ఐ) విధానాలకు అనుగుణంగా ఆన్‌లైన్‌లో క్రీడాకారుల ఎంట్రీలను నమోదుచేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. గతంలో స్టడీ సర్టిఫికెట్ ఆధారంగా ఎంట్రీలు జరిగేవని.. ఇకపై స్కూల్ సర్టిఫికెట్, స్టడీ, డేట్ ఆఫ్ బర్త్ ప్రకారం ఎంట్రీ నమోదు చేయనున్నట్లు స్పష్టం చేవారు. 2025–26 సీజన్‌కుగాను స్టేట్ షెడ్యూల్ వెలువడలేదని, వచ్చిన వెంటనే జిల్లాస్థాయి ఎంపికల షెడ్యూల్‌ను ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి, నౌపడ విజయ్‌కుమార్, బీవీ రమణ, పి.తవిటయ్య, కె.గోపి, కె.హరిబాబు, కె.మాధవరావు, సుజాత, బి.నారాయణరావు, మురళి, రామారావు, ఇచ్ఛాపురం, కాశీబుగ్గ, పలాస, టెక్కలి, నరసన్నపేట, ఆమదాలవలస, పాతపట్నం, పాలకొండ తదితర క్లబ్స్ నుంచి పీడీలు, కోచ్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం వైపు బైక్‌పై వెళుతున్న వి.పతిరాజు అనే వ్యక్తిని కుశాలపురం బైపాస్ సమీపంలో ఆదివారం వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. పతిరాజు స్వగ్రామం పొందూరు మండలం కేశవదాసుపురం. శ్రీకాకుళం నగరానికి పనిపై వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

21న డీఈఓ కార్యాలయం ముట్టడి



సన్నాహక సమావేశంలో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక మరోసారి పోరుబాటకు సిద్ధమౌతోంది. రాష్ట్ర ప్రభుత్వ విడుదల చేసిన అసంబద్ధ రీఅపోర్షన్ ఉత్తర్వులు 19, 20, 21లకు వ్యతిరేకంగా రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 21న ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా డీఈఓ కార్యాలయం ముట్టడిని విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు బమ్మిడి శ్రీరామ్మూర్తి, మజ్జి మదన్‌మోహన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శ్రీకాకుళం నగరంలోని ఎన్‌జీవో హోంలో ఆదివారం సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు సంఘ నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోందని ఆందోళన వ్యక్తంచేశారు. 9 రకాల పాఠశాలలను తీసుకురావడం వెనుక ఉద్దేశమేంటని.. కనీసం ప్రభుత్వానికైనా తెలుసోలేదా తమకు తెలియడంలేదని ప్రశ్నించారు. అటు విద్యార్థులను, ఇటు ఉపాధ్యాయులను గందరగోళానికి నెడుతున్నారని మండిపడ్డారు. బదిలీలు, ప్రమోషన్లకు సంబంధించిన కౌన్సెలింగ్‌ను మ్యాన్యువల్‌గా నిర్వహించాలని డిమాండ్ చేశారు. తెలుగు రాష్ట్రంలో తెలుగు మీడియం లేకుండా చేయడం దారుణమన్నారు. వీటికి నిరసనగా ఈనెల 21న ఉమ్మడి జిల్లాల డీఈవోల కార్యాలయాల ముట్టడి, 23న పాఠశాల విద్య డైరెక్టర్ డైరెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని చెప్పారు. సమావేశంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఎస్.కిషోర్‌కుమార్, గురుగుబెల్లి రమణ, పేడాడ కృష్ణారావు, పిసిని వసంతరావు, బి.రవి, బి.వెంకటేశ్వర్లు, దుప్పల శివరాం ప్రసాద్, సత్యనారాయణ భాస్కరరావు, లక్ష్మణరావు, మురళి, ప్రతాప్‌కుమార్, శరత్‌బాబు, మేరీప్రసాద్, రమేష్, శ్రీనివాస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మరిడమ్మకు ప్రత్యేక పూజలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ క్వార్టర్స్‌లో వెలసి ఉన్న మరిడమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొని మొక్కుతీర్చుకున్నారు.

శ్రీకాకుళం నుంచి సాలూరుకు ప్రత్యేక బస్సులు

శ్రీకాకుళం అర్బన్: సాలూరులో జరిగే శ్యామలాంబ అమ్మవారి పండుగ సందర్భంగా ప్ర యాణికుల సౌకర్యార్థం ఈ నెల 18 నుంచి 21 వరకు పాలకొండ, పలాస, టెక్కలి, శ్రీకాకుళం–1, శ్రీకాకుళం 2వ డిపోల నుంచి 356 బస్సులు నడపనున్నట్లు జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వీటిలో శ్రీకాకుళం నుంచి రాజాం వరకు 80 బస్సులు, రాజాం నుంచి సాలూరు వరకు 180 బస్సులు, బొబ్బిలి నుంచి సాలూ రు వరకు 96 బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. పండగ కోసం బస్సులు వేసినందున జిల్లాలోని పలు సర్వీసులు రద్దవుతాయని, ప్రయాణికులు ఈ విషయాన్ని గ్రహించి ఆర్టీసీ అధికారులకు సహకరించాలని కోరారు.

సైనిక లాంఛనాలతో జవాన్ అంత్యక్రియలు



అంత్యక్రియల్లో పాల్గొన్న జవాన్లు

ఆమదాలవలస: ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు టి.మన్నయ్యపేటకు చెందిన బీఎస్ఎఫ్ జవాన్ గొద్దు మోహనరావు(45) అంత్యక్రియలు ఆదివారం స్వగ్రామంలో సైనిక లాంఛనాలతో నిర్వహించారు. విధుల్లో ఉండగా గుండెపోటుకు గురై మృతిచెందిన సంగతి తెలిసిందే. ఢిల్లీలో పోస్టుమార్టం అనంతరం భౌతికకాయాన్ని స్వగ్రామానికి తరలించారు. శ్రీకాకుళం కొత్తరోడ్డు నుంచి మన్నయ్యపేట వరకు యువకులు జాతీయ జెండా పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. అనంతరం సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తి చేశారు.

క్లుప్తంగా

కార్మిక సంఘాల సార్వత్రిక సమ్మె వాయిదా

- జూలై 9న చేపట్టనున్నట్లు వెల్లడి

విజయనగరం గంటస్తంభం: లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా ఈ నెల 20న కలెక్టరేట్ ఎదుట జరగాల్సిన సార్వత్రిక సమ్మె జూలై 9కి వాయిదా పడినట్లు కేంద్ర కార్మిక సంఘాల నేతలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఐటీయూ, ఏఐఎఫ్‌టీయూ న్యూ, ఇఫ్టూ దేశంలో ఉన్న ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ సమ్మెకు పిలుపునిచ్చాయి. దేశం ఇంత తీవ్రమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నప్పటికీ కేంద్రప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తూ లేబర్ కోడ్‌ల అమలును దూకుడుగా ముందుకు తీసుకెళ్తోందని విమర్శించారు. కార్మిక సంఘాల హక్కులను కాలరాస్తోందని కేంద్ర కార్మిక సంఘాల నేతలు విమర్శించారు. జూలై 9వ తేదీన సమ్మె జయప్రదం చేసేందుకు సమాయత్తం కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

ఆలయంపై పడిన పిడుగు



పిడుగు దాటికి ఊడిన పెచ్చులు

గంట్యాడ: మండలంలోని పెదవేమలి గ్రామంలో కాశీమాత ఆలయంలో కొలువైన లక్ష్మీగణపతి ఆలయంపై ఆదివారం మధ్యాహ్నం పిడుగు పడింది. పిడుగు శబ్దానికి ఆలయం గోపురం పెచ్చులు ఊడిపోయాయి. ఆలయం కింద భక్తులు ఉన్నప్పటికీ అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. దీంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

వ్యక్తిపై దాడి కేసు నమోదు

సంతకవిటి: మండలంలోని పొనుగుటివలస గ్రామంలో బొండాడ నారాయణ తమ్ముడి కొడుకు బొండాడ గణేష్ శనివారం రాత్రి పెదనాన్న నారాయణపై వెదురు కర్రతో దాడి చేయడంతో గణేష్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై ఆర్.గోపాలరావు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం బొండాడ నారాయణ, బొండాడ గణేష్ కుటుంబాల మధ్య ఉన్న పాత తగాదాల నేపథ్యంలో, శనివారం రాత్రి తాగిన మైకంలో గణేష్ నారాయణపై దాడి చేయడంతో నారాయణ చేతికి గాయమైంది..దీంతో నారాయణ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. నారాయణ ప్రస్తుతం శ్రీకాకుళంలోని ఓ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

తివ్వాకొండల్లో ఏనుగుల సంచారం



తివ్వాకొండ చరియల్లో ఏనుగుల గుంపు

భామిని: మండలం సరిహద్దుగా గల తివ్వాకొండల్లో ఏనుగుల గుంపు తాగునీటి కోసం తహతహ లాడుతోంది. ఈ మేరకు ఆదివారం భామిని-గుమ్మలక్ష్మీపురం మండలాల సరిహద్దుల్లో ఏనుగుల గుంపు పచార్లు కొట్టినట్లు గిరిజనులు తెలిపారు. రాతి గుట్టల్లో నడుస్తూ నీటి కోసం పయనిస్తున్నట్లు చెప్పారు. ఒక పక్క మండు వేసవితో అల్లాడుతున్న పరిస్థితిలో ఏనుగుల గుంపు అవస్థలు పడుతున్నట్లు తెలియజేశారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



అప్పలనాయుడు మృతదేహం

మెరకముడిదాం: మండలంలోని ఎం.గదబవలస గ్రామానికి చెందిన ఆరంగి అప్పలనాయుడు (42) ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, మృతుని బంధువులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఆరంగి అప్పలనాయుడు తరచూ మద్యం తాగుతుండడంతో కుటుంబకలహాలు నెలకొన్నాయి, ఈ క్రమంలో మనస్తాపం చెందిన అప్పలనాయుడు ఆదివారం ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బుదరాయవలస ఎస్సై జె.లోకేష్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి అప్పలనాయుడు మృతికి గల కారణాలపై ఆరా తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం చీపురుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వేశాఖ నిర్లక్ష్యం

- ఈ ఏడాదీ మామిడి ఎగుమతులు నిల్
- కిసాన్ రైళ్లకు ప్రాధాన్యం కల్పించని అధికారులు
- అధిక మొత్తంలో డబ్బులు చెల్లించలేక.. ప్రత్యామ్నాయ మార్గాల వైపు రైతులు
- సాధారణ రైళ్ల కైనా... డిస్కౌంట్ ఇవ్వని నడపని అధికారులు
- తూతూ మంత్రంగా ఎగుమతిదారులతో మంతనాలు
- నష్టాలబాట పట్టలేక రోడ్డు రవాణా వైపే రైతుల మొగ్గు



గూడ్స్ ద్వారా మామిడి ఎగుమతులు అవుతున్న దృశ్యం (ఫైల్)

విజయనగరం టౌన్: మామిడి ఎగుమతులనుద్దేశించి విజయనగరం ఖ్యాతిని దేశ ప్రధాని మోడీ ప్రస్తుతించిన సంగతి తెలిసిందే. అటువంటి మామిడి ఎగుమతులపై రైల్వేశాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో గతేడాది ఎగుమతుల్లేకుండా పోయాయి. ఈ ఏడాది కూడా పంట పూర్తయిపోయి, ఇతర మార్గాల గుండా వెళ్లిపోతున్నప్పటికీ అధికారులు ఏమాత్రం చలించకపోవడం గమనార్హం. సంబంధిత మేంగో అసోసియేషన్‌లతో తూతూమంత్రంగా సంప్రదింపులు చేసి వదిలేయడంతో వ్యాపారస్తులు ప్రత్యామ్నాయ మార్గాల వైపు దృష్టిసారించాల్సిన పరిస్థితి నెలకొంది. ఏమాత్రమైనా వ్యాపారస్తులకు అవకాశం కల్పించి, రాయితీలిచ్చినట్లయితే ఈ ఏడాదైనా మామిడి పంట రైళ్ల ద్వారా వెళ్లేది. కానీ కేవలం నిర్లక్ష్యం కారణంగానే కోట్లాది రూపాయలను రైల్వేశాఖ నష్టపోయిందనడంలో అతిశయోక్తిలేదు.

ఏడాదికోమారు పండే మామిడి పంటను ఢిల్లీ, ముంబై వంటి ప్రాంతాలకు రైల్వే ద్వారా ఎగుమతులు చేస్తూ ఎంతో కొంతమేర రైతులు లాభాన్ని చూద్దామనుకుంటుంటారు. అయితే చద్దన్నం కన్నా ఊరగాయ ఖర్చే ఎక్కువ అన్న చందాన ప్రస్తుతం రైతుల పరిస్థితి ఉంది. విజయనగరం జిల్లా వ్యాప్తంగా మామిడి పంటను రైతన్నలు బుట్టలు కట్టి, ప్యాకింగ్‌లు చేసి రైల్వే ద్వారా ఇతర ప్రాంతాలకు పంపించే మేంగో అసోసి యేషన్‌కు అమ్మకాలు చేపట్టడమే కాకుండా దగ్గరుండి బుట్టలను రైలుపెట్టెల్లో సర్ది మరీ పంపిస్తుంటారు. అయితే గతేడాది కూడా రైల్వేశాఖ నిర్లక్ష్యం కారణంగానే మామిడి ఎగుమతుల్లేకుండా పోయాయి. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి తలెత్తింది. కేవలం అధిక లభార్జనే ధ్యేయంగా రైల్వేశాఖ పనిచేస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే సాధారణ ఎక్స్‌ప్రెస్, పాసింజర్ రైళ్ల టికెట్ల ధరలను రైల్వేశాఖ పెంచేసింది. జనరల్ బోగీలతో పాటు స్లీపర్ క్లాస్‌లను కుదించేసింది. ఏసీ భోగీలకు ప్రాధాన్యం కల్పించి సామాన్యుడి నడ్డి విరగ్గొట్టింది. మామిడి ఎగుమతులను కరోనా వంటి విపత్కర సమయంలోనూ కిసాన్ రైళ్లను ప్రవేశపెట్టి రైతులకు వెన్నుదన్నుగా నిలబడిన రైల్వేశాఖ కరోనా తర్వాత సగం ధరకే వచ్చే కిసాన్ రైళ్లకు స్వస్తిపలికింది. దీంతో సరైన పంటలేక, చాలీచాలని లోడ్‌లను వ్యాపారస్తులు నలుగురైదుగురు కలిసి రైళ్ల ద్వారా పంపిద్దామంటే కిసాన్ రైళ్లు లేకుండా పోయాయి. సాధారణ గూడ్స్ ద్వారా పంపిద్దామంటే నాలుగైదు బోగీలే తప్ప మిగతావన్నీ ఖాళీగానే వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుంది. కానీ ప్రతి బోగీకి డబ్బులు చెల్లించాల్సిందే. దీంతో వ్యాపారులు తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఉంది. దానిమూలంగా ప్రత్యామ్నాయమార్గాలవైపు వ్యాపారులు దృష్టిసారించారు. ఉన్నతాధికారుల బాధ్యతా రాహిత్యం కారణంగానే రెండేళ్లుగా మామిడి ఎగుమతుల్లేకుండా పోయాయని పలువురు వ్యాపారస్తులు అభిప్రాయపడ్డారు.

మేంగో అసోసియేషన్‌లతో సమావేశం నిర్వహించాం

ఈ ఏడాది మామిడి పంటను ఎగుమతులు చేసే విధంగా చూడాలని మేంగో అసోసియేషన్‌లతో సమావేశాన్ని నిర్వహించాం. అయితే పంట తక్కువ ఉందన్న కారణంగా వారంతా సుముఖత చూపించలేదు. పైగా కిసాన్ రైళ్లు, రాయితీలు కావాలని అడుగుతున్నారు. దీనిపైన ఉన్నతాధికారులకు నివేదించాం. జనరల్ బోగీలను ఇస్తామన్నాం. సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం.

– బి. వెంకట సత్యనారాయణ, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్, విజయనగరం

అవసరం మేరకు అడిగాం

రైల్వేశాఖ ద్వారా ఏటా మామిడి ఎగుమతులు రాయితీపై పంపించేవారం. కిసాన్ రైళ్లను అందించలేదు. జనరల్ బోగీల ద్వారా ఎగుమతులు చేసేందుకు లక్షల రూపాయలు ఖర్చవుతున్నాయి. రోడ్డు రవాణా ద్వారా మామిడి ఎగుమతులును నేరుగా స్టాక్ పాయింట్‌కే పంపించేస్తున్నాం. దీనివల్ల ఖర్చు తగ్గింది. రైల్వే అధికారులు కొంచెం ప్రాధాన్యం కల్పించి, రాయితీలు కల్పించి ఉంటే బాగుండేది.

– ముదునూరి నారాయణమూర్తి రాజు, మేంగో అసోసియేషన్ ప్రతినిధి, విజయనగరం

కనులపండువగా శ్యామలాంబ పండగ ప్రారంభం



ఉయ్యాలకంబాల ఉత్సవంలో యువరాజు తదితరులు



తోపులాటతో ఇబ్బందులకు గురై బయటకు వస్తున్న యువరాజు



మెంటాడ వీధిలో ఉన్న వీరభద్రుని ప్రభ

సాలూరు: శ్యామలాంబ అమ్మవారి ఉత్సవం కనులపండువగా ప్రారంభమైంది. ఆదివారం ఉయ్యాలకంబాల వేడుకను పెదకోమటిపేట గద్దె వద్ద సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. గద్దె వద్ద ఏర్పాటుచేసిన ఉయ్యాలలో జమిందార్ కుటుంబానికి చెందిన విక్రమచంద్ర సన్యాసి రాజు, తదితరులను ఉయ్యాలలో కూర్చోబెట్టి పెద్దలు ఊపారు. వేలాది మంది భక్తులు ఈ వేడుకను తిలకించేందుకు తరలివచ్చారు. స్వల్ప తోపులాట నేపథ్యంలో యువరాజు, పెద్దలు కొంత ఇబ్బందిపడ్డారు. కార్యక్రమంలో స్త్రీశిశు, గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్‌పీ భంజ్‌దేవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తొల్లేళ్ల ఉత్సవం

సోమవారం తొల్లేళ్ల ఉత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. జన్నివీధిలో ఉన్న అమ్మవారి గద్దె నుంచి ఘటాను గొల్లవీధి వాసులు తీసుకొస్తూ కర్రలతో సాము చేస్తారు. ఒక వీధి తరువాత మిగిలిన వీధి వాసులంతా ఈ ఉత్సవంలో పాల్గొని ఘటాలను ఊరేగిస్తారు.

ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ మాధవరెడ్డి

పండగ నేపథ్యంలో ఏర్పాట్లను ఎస్పీ మాధవరెడ్డి పరిశీలించారు. ఆదివారం పట్టణానికి వచ్చిన ఆయన సిరిమాను తిరిగే ప్రాంతాలు, పార్కింగ్ తదితర అంశాలపై ఆరా తీసి అధికారులకు పలు ఆదేశాలు జారీచేశారు. కంట్రోల్‌రూమ్‌ను పరిశీలించారు.

ఇబ్బందులు పడిన పోలీసులు

సుమారు వెయ్యి మంది పోలీసులు ఈ ఉత్సవానికి బందోబస్తు నిమిత్తం వచ్చారు. అయితే బందోబస్తు పోలీసులకు పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల వద్ద భోజనాలు ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి అక్కడ విద్యుత్ వెలుగులు లేకపోవడంతో చీకట్లో పోలీసులు భోజనాలు చేయడం కనిపించింది. సెల్‌ఫోన్ లైట్లు వేసుకుని, అటుగా వచ్చే వాహనాల వెలుతురు మధ్య పలువురు పోలీసులు భోజనాలు చేస్తూ ఇబ్బందులు పడ్డారు.



కంట్రోల్‌రూమ్ నుంచి ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి



చీకట్లో భోజనాలు చేస్తున్న పోలీసులు

ముగిసిన జిల్లా స్థాయి చెస్ పోటీలు

విజయనగరం: చెస్‌అసోసియేషన్ ఆఫ్ విజయనగరం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీలకు స్పందన లభించింది. రింగ్‌రోడ్‌లో ఉన్న ఫైర్ చెస్ స్కూల్లో అసోసియేషన్ కార్యదర్శి కేవీ జ్వాలాముఖి ఆధ్వర్యంలో అండర్ -7,9,11,13 విభాగాలతో పాటు ఓపెన్ విభాగాల్లో నిర్వహించిన పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 80 మంది క్రీడాకారులు హాజరయ్యారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు త్వరలో రాజాంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ పోటీలను వి.వెంకటేష్, ధనలక్ష్మి, పద్మావతి, అర్చనలు పర్యవేక్షించారు.



చెస్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

కిడ్నాపైన వివాహిత హత్య



హత్యకు గురైన వెంకటలక్ష్మి (ఫైల్)

బావిలో మృతదేహాన్ని తీస్తున్న పోలీసులు, బావివద్దకు చేరుకున్న గ్రామస్తులు

- బావిలో లభ్యమైన మృతదేహం
- ఉలిక్కిపడిన గ్రామస్తులు

శృంగవరపుకోట: మండలంలోని వెంకటరమణపేట గ్రామానికి చెందిన వివాహిత కిడ్నాప్‌కు గురికావడం..ఆపై ఆమె మృతదేహం బావిలో లభ్యం కావడంతో గ్రామస్తులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఎర్రాప్రగడ వెంకటక్ష్మి (38) శనివారం రాత్రి 10 గంటల సమయంలో కుమార్తె రిషితతో కలిసి బహిర్భూమికి వెళ్లింది. కొద్ది సేపటి తర్వాత రిషిత ఇంటికి వచ్చి ఎవరో గుర్తుతెలియని కొందరు వచ్చి అమ్మను ఆటోఎక్కించి తీసుకెళ్లిపోయారని, తనను పక్కకు తోసేశారని తండ్రి సత్యనారాయణ, అన్నయ్య హరీష్‌కు చెప్పగా వారు పరిసర గ్రామాలకు బైక్‌లతో వెళ్లి వెతికినప్పటికీ ఆచూకీ తెలియకపోవడంతో వెంటనే పోలీసులకు హరీష్ ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు కిడ్నాప్ అయిన వివాహిత ఆచూకీ కోసం సీఐ నారాయణమూర్తి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది తీవ్రంగా ప్రయత్నించారు. ఆదివారం ఉదయం డాగ్‌స్క్వాడ్‌తో ఆచూకీ కోసం ప్రయత్నిస్తుండగా గ్రామసమీపంలోని బావిలో మహిళ మృతదేహం ఉన్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. వెలికితీసిన మృతదేహాన్ని వెంకటలక్ష్మిగా గుర్తించడంతో గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. అనంతరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ శ్రీనివాసరావు పరిశీలించి వివరాలు సేకరించారు.

గంజాయి పీలుస్తున్న వ్యక్తి అరెస్ట్



గంజాయితో పాటు పోలీసులు పట్టుకున్న వ్యక్తి

నెల్లిమర్ల: గంజాయి పీలుస్తూ పట్టుబడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై బి.గణేష్. తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ నారాయణపట్నం బ్రిడ్జి దగ్గర ఉన్న రైల్వే ట్రాక్ ప్రాంతంలో ఒక వ్యక్తి అక్రమంగా గంజాయి కలిగి ఉండి పీలుస్తున్నాడన్న సమాచారంపై సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. అలాగే జరజాపు పేటకు చెందిన యశ్వంత్ అనే వ్యక్తి వద్ద 100 గ్రాముల గంజాయి, గంజాయి పీల్చడానికి ఉపయోగించే పరికరాలను సీజ్ చేసి అదుపులోకి తీసుకుని అరెస్టు చేశామన్నారు. నిందితుడు గడిచిన ఆరేడు సంవత్సరాల నుంచి గంజాయి వినియోగిస్తున్నాడని, ఒడిశా రాష్ట్రంలోని రాయగడ రైల్వేస్టేషన్ ప్రాంతంలో కొనుక్కుని ఇక్కడికి తీసుకొని వచ్చి వినియోగిస్తున్నట్లు విచారణలో చెప్పినట్లు తెలిపారు. మండలంలో ఎవరైనా గంజాయి వినియోగించినా.. గంజాయి కలిగి ఉన్నా, ఏ రూపంలో అయినా గంజాయికి సంబంధించి కార్యక్రమాల్లో పాలుపంచుకున్న వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై గణేష్ హెచ్చరించారు. గంజాయి గురించి సమాచారాన్ని ఫోన్ 912110944 నంబర్‌కు తెలియజేయాలని కోరారు. దాడుల్లో సిబ్బంది దామోదర్ రావు, వీఆర్వో వెంకటలక్ష్మి, మహిళా పోలీస్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఏపీ ఈఏపీ సెట్

- 19, 20 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశ పరీక్షలు
- 21 నుంచి 27 వరకు ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా హాజరు కాకున్న 15,390 మంది విద్యార్థులు
- 5 పరీక్ష కేంద్రాల ఏర్పాటు

విజయనగరం అర్బన్: ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన ఏపీ ఈఏపీసెట్-2025 ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్టులు (సీబీటీ) సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. తొలి రెండు రోజులు అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ప్రవేశ పరీక్షలు జరగనుండగా ఈ నెల 21 నుంచి 27వ తేదీ వరకు ఇంజినీరింగ్ కోర్సుల ప్రవేశ పరీక్షలు జరగనున్నాయి. జేఎన్‌టీయూ కాకినాడ భాగస్వామ్యంతో రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఈ పరీక్ష నిర్వహిస్తోంది. ఉమ్మడి విజయనగరం జిల్లాలో అగ్రికల్చర్, ఫార్మసీ, ఇంజినీరింగ్ పరీక్షలకు 15,390 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వారిలో ఇంజినీరింగ్ పరీక్షలకు 11,085మంది, అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలకు 4,280మంది రెండూ కలిపి రాస్తున్న విద్యార్థులు 25 మంది ఉన్నారు. వివిధ ఇంజినీరింగ్ కళాశాలలతోపాటు అయాన్ డిజిటల్ జోన్ కేంద్రాలను కలుపుకుని మొత్తం 5 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మళ్లీ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు విడతల్లో పరీక్షలు జరగనున్నాయి.



ఉమ్మడి జిల్లాలో పరీక్షా కేంద్రాలు

- ఏపీ ఈఏపీసెట్ అగ్రికల్చర్, ఫార్మసీ, ఇంజినీరింగ్ పరీక్షలకు ఉమ్మడి విజయనగరం జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఐదు పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు హాజరుకానున్నారు.
- ఉమ్మడి జిల్లాలోని పార్వతీపురం మన్యం జిల్లా ప్రాంతాలకు చెందిన 3,993 మంది విద్యార్థుల కోసం రాజాంలోని జీఎంఆర్ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. వారిలో ఇంజినీరింగ్ పరీక్ష కోసం 2,873 మంది, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీకి 1114 మంది, రెండూ కలిపి రాసేవారు ఆరుగురు ఉన్నారు.
- విజయనగరం జిల్లా పరిధిలో వివిధ ప్రాంతాలకు చెందిన 8,212 మంది విద్యార్థుల కోసం పట్టణంలోని నాలుగు కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిలో ఇంజినీరింగ్ పరీక్ష కోసం 8,212 మంది, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ 3,166 మంది రెండూ కలిపి రాసే వారు 19 మంది ఉన్నారు. నాలుగు పరీక్ష కేంద్రాల్లో పట్టణ శివారులో ఉన్న ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల, సీతం ఇంజినీరింగ్ కళాశాల, లెండి ఇంజినీరింగ్ కళాశాల, అవంతి ఇంజినీరింగ్ కళాశాల ఉన్నాయి.

విద్యార్థులు వీటిని వెంట తీసుకెళ్లాలి

- విద్యార్థులు ఆన్‌లైన్‌లో దాఖలు చేసిన ఏపీ ఈఏపీ సెట్-2025 దరఖాస్తు ప్రింటవుట్ కాపీలో పొందుపర్చిన నిర్ణీత బాక్స్‌లో విద్యార్థి కలర్ పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోను అతికించి, సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్‌తో సంతకం చేయించుకోవాలి.
- పరీక్ష జరిగే రోజున సదరు ప్రింటవుట్ కాపీతోపాటు హాల్ టికెట్ వెంట తీసుకుని వెళ్లాలి. బ్లూ, బ్లాక్ కలర్ బాల్ పాయింట్ పెన్ను అనుమతిస్తారు. గుర్తింపు కోసం ఇంటర్‌మీడియట్ హాల్ టికెట్, పాస్‌పోర్ట్, పాన్‌కార్డు, ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీలలో ఏదో ఒకటి ఒరిజినల్ తీసుకు వెళ్లాలి. ఇవి మినహా ఇతర వస్తువులను అనుమతించరు.
- విద్యార్థి ఫొటో అతికించిన ఆన్‌లైన్ దరఖాస్తు కాపీపై పరీక్ష కేంద్రంలో ఇన్విజిలేటర్ సమక్షంలో సంతకం చేసి, ఎడమ చేతి బొటనవేలి ముద్ర వేయాలి.

కేంద్రాల వద్ద తనిఖీలు

ఏపీ ఈఏపీ సెట్‌కు హాజరు కానున్న విద్యార్థులను ఉదయం 7.30 గంటల నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 12.30గంటల నుంచి 2 గంటల వరకు అనుమతిస్తారు. ఉదయం 9 గంటలు, మధ్యాహ్నం 2 గంటల తరువాత నిమిషం ఆలస్యమైనా ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరు. పరీక్ష జరిగే రోజున కనీసం గంట ముందుగా కేంద్రానికి చేరుకోవాలి. కేంద్రాల దగ్గర తనిఖీలతోపాటు బయోమెట్రిక్ హాజరు నమోదు, సంతకం చేయాల్సి ఉన్నందున చివరి నిమిషంలో హడావుడి పడకుండా చూసుకోవాలి.

డీఈఓ కార్యాలయాల ముట్టడి విజయవంతం చేయాలి

విజయనగరం అర్బన్: విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే విధానాలను కూటమి ప్రభుత్వం మానుకోవాలనే డిమాండ్‌తో ఈ నెల 21న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లోని డీఈఓ కార్యాలయాల ముట్టడికి పిలుపునిచ్చిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక జిల్లా కమిటీ పిలు పునిచ్చింది. ఈ మేరకు స్థానిక ఎన్‌జీఓ హోమ్‌లో ఆదివారం నిర్వహించిన కమిటీ సమావేశంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎస్‌జీటీలకు ప్రమోషన్ ఇచ్చి మోడల్ ప్రైమరీ స్కూళ్లకు ప్రధానోపాధ్యాయులుగా నియమించాలని డిమాండ్ చేశారు. ఫౌండేషన్, బేసిక్ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 41 వద్ద 3వ పోస్టు ఇవ్వాలని కోరారు. ఎస్‌జీటీలకు ఆన్‌లైన్‌తో కూడిన మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ పోస్టులను బ్లాక్ చేయడం సరైన చర్య కాదని అన్ని ఖాళీలను బదిలీ కౌన్సెలింగ్‌లో చూపించాలని కోరారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యతో ప్రమేయం లేకుండా అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు రవీంద్రనాయుడు, డి.శ్రీనివాస్, భాస్కరరావు, రాము, కె.శ్రీనివాసరావు, డి.రాము, జేఆర్‌కే ఈశ్వరరావు, జోగారావు, సూరిబాబు, డి.ఈశ్వరరావు, పాల్తేరు శ్రీనివాస్, టి.సన్యాసిరాజు, ఎ.కృష్ణారావు, ఇ.రాము నాయుడు, వై.శ్రీనివా సరావు పాల్గొన్నారు.

రోడ్డు పక్కన చెట్ల నరికివేత







రహదారి పక్కన మొదళ్ల వరకు నరికివేసిన నీడనిచ్చే చెట్లు

గరుగుబిల్లి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని ప్రభుత్వాలు, ఎన్‌జీఓ సంఘాలు కోరుతుంటే విద్యుత్‌శాఖ అధికారుల తీరుమాత్రం దానికి భిన్నంగా ఉంది. గరుగుబిల్లి మండలంలోని గొలవానివలస నుంచి దళాయివలస జంక్షన్ వరకు విద్యుత్ లైన్ పునరుద్ధరణ పనుల నిమిత్తం రహదారికి ఒకవైపు ఉన్న దాదాపు 50 చెట్లను నిర్దాక్ష్యంగా చెట్ల మొదళ్ల వరకు నరికివేయడంతో విద్యుత్ శాఖ సిబ్బంది తీరుపట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. స్వచ్ఛమైన గాలి, పాదచారులకు నీడనిచ్చే చెట్లను మళ్లీ బతికేందుకు వీలులేకుండా నరికివేయడం పట్ల పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సంవత్సరాల వయస్సు గల చెట్లను ఇంత నిర్లక్ష్యంగా విద్యుత్ పనులకు ఆటంకంగా ఉన్నాయని నెపంతో ఈ విధంగా చేయడం సరికాదని అభిప్రాయ పడుతున్నారు. వీటినైనంత మేరకు విద్యుత్ శాఖ వారి పనులకు అడ్డంకిగా ఉంటే కొమ్మలను తొలగించాలే తప్ప చెట్లను నరికివేయడం సరికాదని పలువురు వాపోతున్నారు. ఏది ఏమైనప్పటికీ చెట్లు నరికి వేసిన చోట బాధ్యతగా మొక్కలు నాటాలని కోరుతున్నారు.